మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, పక్కన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

కేసులకు భయపడేది లేదు

హామీలపై నిలదీస్తున్నందుకే కాంగ్రెస్ కుట్రలు

- తాజాగా బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులపై కుయుక్తులు
- నిబంధనల మేరకే కార్యాలయానికి స్థలం కేటాయింపు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- పార్టీ ఆఫీసు ఇటుకపెళ్ల కదిపితే.. గాంధీభవన్ కూలుతది
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ, జూలై4: 'కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ అక్రమ కేసులు పెడుతూ భయాందోళనకు గురిచేస్తోంది. కేసులకు భయపడే ప్రసక్తే లేదు. న్యాయ పోరాటం చేస్తాం. పార్టీ శ్రేణుల జోలికి వస్తే ఖబర్దార్ అని' బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అని చెప్పి ప్రతీకార పాలన చేస్తుందని అన్నారు. ఆరు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను కూడగట్టుకుందని, ఇచ్చిన హామీలపై మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని పేర్కొన్నారు. హామీలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులపై అభాండాలు, ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఒక నెల మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని, మరో నెల విద్యుత్ అవినీతని, ఇంకో నెల టెలిఫోన్ ట్యాపింగ్ అని, తాజాగా బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులకు కేటాయించిన స్థలాలపై మాట్లాడుతూ హామీలను తాత్సారం చేస్తున్నదని దాస్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు చెప్పుకునేందుకు బాధితులు బీఆర్ఎస్ కార్యాలయాలకు వస్తున్నారని, దాన్ని చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేక ఆఫీసులను కూల్చివేయాలని చూస్తున్నదని ఆరోపించారు. నగరంలోని సర్వే నంబర్ 1066లో ఎకరం భూమిని బీఆర్ఎస్ పార్టీ రూ. 4,84,000కు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేసి పార్టీ కార్యక్రమాలకు వాడుతుందన్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ భూమిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పంపిన నోటీసుకు వివరణ ఇచ్చామని తెలిపారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో కక్షపూరితంగా వ్యవహరించలేదని, నాయిని లాంటి ఎమ్మెల్యేను చూడలేదన్నారు.

పార్టీ కార్యాలయం కూల్చే కుట్ర: మాజీ ఎమ్మెల్యే పెద్ది

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చే కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఇటుక పెళ్ల కదిపినా గాంధీభవన్ కూల్చడమే కాకుండా జిల్లా కార్యాలయాలను టచ్ చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆంధ్రాబ్యాంకుకు, కరీంనగర్ జిల్లా ఆఫీసును పెళ్లిళ్లకు కిరాయికి ఇస్తున్నారని, ఖమ్మంలో కమర్షియల్‌గా వాడుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, బోయినపల్లి రంజిత్‌రావు, నల్ల స్వరూపారాణి, ఇమ్మడి లోహిత, పార్టీ సీనియర్ నాయకులు జానకిరాములు, నయీముద్దీన్, బండి రజిని కుమార్, పరశురామ్, పోలెపల్లి రామ్మూర్తి, విద్యార్థి సంఘం నాయకులు బైరపాక ప్రశాంత్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఎడ్యుకేషన్ హబ్‌గా వరంగల్

- ప్రపంచానికి దీటుగా కోర్సులు అందిస్తాం
- జై జవాన్.. జై కిసాన్ నినాదాలిచ్చిన లాల్‌బహదూర్ శాస్త్రి
- ఎల్బీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

హనుమకొండ చౌరస్తా, జూలై 4 : వరంగల్‌ను రాష్ట్రంలోనే నంబర్‌వన్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే వరంగల్‌లో నిట్, కాకతీయ యూనివర్సిటీ, ఆర్ట్స్ అండ్ సైన్స్‌తో పాటు ఎల్బీ కాలేజీ, ఐటీ పార్కులున్నాయని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం నిర్వహించిన వరంగల్ బహదూర్ (ఎల్బీ) కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్.. జైకిసాన్ నినాదాలిచ్చారని గుర్తుచేశారు. ప్రపంచానికి దీటుగా విద్యార్థులు నిలబడేలా కోర్సులు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ క్రైమ్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఎల్బీ కాలేజీ విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ మరో 50 ఏళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా రాబోయే కాలంలో ఎల్బీ లాంటి అనేక కాలేజీలను స్థాపించి విద్యాబోధన అందిస్తామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీ కాలేజీ ఎంతోమంది విద్యార్థి నాయకులను తయారు చేసిందన్నారు.

కాలేజీ అభివృద్ధికి, నూతన బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎల్బీ కాలేజీ చైర్మన్ కే నిరంజన్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఈ రాజేందర్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రమేశ్, ట్రెజరర్ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ అరుణ, ఎన్‌సీసీ ఆఫీసర్ సదానందం, పీడీ ప్రభాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో మడుగు..

- గుంతలమయంగా మహదేవపూర్ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారి
- ఇబ్బందులు పడుతున్న రైతులు

గుంతలుగా మారిన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మహదేవపూర్, జూలై 4 : మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రోడ్డు గుంతలమయమై అడుగడుగుకో మడుగు ఏర్పడింది. వర్షపు నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. బురదమయంగా మారిన రహదారితో రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం వెళ్తూ ఏ గుంతలో పడిపోతామో అని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని రైతులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌కు ముగిసిన ఎంపిక పోటీలు

హనుమకొండ చౌరస్తా, జూలై 4 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు ముగిశాయి. మహబూబ్‌నగర్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ తదితర సుదూర ప్రాంతాల నుంచి క్రీడాకారులు రాగా, గురువారం ఈ ఎంపిక పోటీలను జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోత్ అశోక్ కుమార్ ప్రారంభించారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జిమ్, మెడిసన్ బాల్ త్రో, 800 మీటర్ల పరుగు పందెం బ్యాటరీ టెస్టులను నిర్వహించారు. రెజ్లింగ్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో సుమారు వంద మంది హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సెలక్షన్స్‌లో అత్యధికంగా రెజ్లింగ్‌లో, అత్యల్పంగా స్విమ్మింగ్‌లో క్రీడాకారులు పాల్గొన్నారని అధికారులు తెలిపారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్ల జాబితాను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి సమర్పించనున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు.

వరంగల్ ప్రగతిపై సమీక్ష చేస్తున్న మంత్రులు పొంగులేటి, సురేఖ, సీతక్క

వరద ముప్పు నుంచి నగరాన్ని విముక్తి చేస్తాం
యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు
కాళోజీ జయంతికి కళా క్షేత్రం సిద్ధం చేయాలి

2050 విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్

తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి

- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను వేగవంతం చేయాలి
- ఉమ్మడి జిల్లా, నగరాభివృద్ధి సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు

వరంగల్, జూలై 4 : వరంగల్ నగర జనాభా పెరుగుదలకు అనుగుణంగా 2050 విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా, నగరాభివృద్ధిపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, వరంగల్ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, నర్సంపేట మెడికల్ కళాశాల తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ పరిధిలో వచ్చే నియోజకవర్గాల ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. హెల్త్‌సిటీ, ఫార్మా సిటీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఎకో టూరిజం, విద్య, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి జోన్‌లను గుర్తించి మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చాలని సూచించారు. నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కుడా పరిధిని విస్తరించాలని అన్నారు. జక్కలొద్దిలో ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ చేయాలన్నారు. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుల భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఇళ్లు, భూములు కోల్పోయిన బాధితులకు భూమి అందించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం జోక్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్దిష్ట గడువులోగా ఓఆర్ఆర్ పనులు పూర్తి చేయాలన్నారు. ఫేస్-1 పనులు చేస్తూనే ఫేస్-2 పనులకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు ఇన్నర్ రింగ్ రోడ్డుతో కనెక్టివిటీ ఉండేలా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బందులు కలుగకుండా ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను వేగవంతం చేయాలని, ఇందుకు అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు.

కాళోజీ జయంతి నాటికి కళాక్షేత్రం పూర్తి

కాళోజీ నారాయణరావు జయంతి సెప్టెంబర్ 9 నాటికి కళాక్షేత్రం పనులు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సంపేట మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఎంజీఎంలో జూనియర్ డాక్టర్లకు కేటాయించిన హాస్టల్ దుస్థితిని ఎంజీఎం అధికారులు మంత్రుల దృష్టికి తీసుకురాగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంజీఎం దవాఖానలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ సౌకర్యాలపై మంత్రి సురేఖ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, సీడీఎంఏ వీపీ గౌతం, ఆర్ అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ హరిచందన, ఆరోగ్యశాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు

గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో నాలా పరిరక్షణకు ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ప్రధాన నాలాలకు రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నగర ప్రధాన రహదారులపై వరద నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. డీఆర్ఎఫ్‌ను పటిష్టం చేయాలని, నగర అవసరాలకు అనుగుణంగా రెస్క్యూ బృందాలను సన్నద్ధం చేయాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సభ్యుల సంఖ్యను పెంచాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివాసం ఉండే పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చేలా ప్రణాళికలు చేయాలన్నారు. గ్రేటర్ కార్పొరేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని ఎకో టూరిజం పాలసీ రూపొందించాలని అటవీ శాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. ఇనుపరాతి గుట్టను ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ట్రెక్కింగ్, నైట్ క్యాంపెయినింగ్, పర్యాటకులు సేద తీరేందుకు వసతులు కల్పించాలన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయం

- అనుమతి లేదంటూ కూలగొట్టేందుకు అధికారుల యత్నం
- కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో సాహసం
- మహిళలు తిరగబడడంతో వెనుదిరిగిన వైనం
- దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో ఘటన

కామారెడ్డిగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చేందుకు సిద్ధమైన జీపీ సిబ్బంది

దేవరుప్పుల, జూలై 4 : జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం ఎస్సీ కాలనీలో నెలకొల్పిన తెలంగాణ విగ్రహానికి రాజకీయ రంగు పులిమారు. బీఆర్ఎస్ మండల కార్యదర్శి చింత రవి ఈ విగ్రహం ఏర్పాటుచేయడమే తప్పుగా భావించిన కాంగ్రెస్ నాయకులు దీనిని కూలగొట్టాలనే కుట్రకు తెరలేపారు. అనుమతి లేదంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ విగ్రహాన్ని గురువారం సాయంత్రం గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగించబోయారు. ఇంతలోనే మహిళలు తెలంగాణ తల్లి అందరిదని, దీనిపై రాజకీయం చేయడం తగదని, కూలగొట్టడం ఆపాలని గొడవ చేయడం, మరోవైపు రాత్రి కావడంతో అధికారులు వెనుతిరిగారు.

ఉత్సాహం చూపిన అధికారులు

తెలంగాణతల్లి విగ్రహ నిర్మాణానికి అనుమతి లేదనే నెపంతో కూలగొట్టేందుకు అధికారులు ఉత్సాహం ప్రదర్శించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్సై చెన్నకేశవులు, ఎంపీవో సురేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అంజలి, ఇతర గ్రామాల కార్యదర్శులు జీపీ సిబ్బందిని పురమాయించి విగ్రహాన్ని కూలగొట్టేందుకు ఉపక్రమించారు. స్థానిక ప్రజలు తిరగబడడంతో పనులు ఆపి వెనుతిరిగారు. ఒక మూలకు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఈ విగ్రహాన్ని కూల్చివేత వెనుక రాజకీయం ఉందని, పెద్ద తలకాయల ఒత్తిడి తమపై ఉండడంతో ఈ పనికి పూనుకున్నట్లు పేరు చెప్పుకోలేని అధికారులు తెలిపారు.

రెండేళ్ల క్రితం నిర్మించిన గద్దె..

రెండేండ్ల క్రితం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఈ గద్దెను చింత రవి నిర్మించగా, కాలనీకి చెందిన కొందరు వ్యతిరేకించడంతో ఆ విగ్రహాన్ని కామారెడ్డిగూడెం జాతీయ రహదారి పక్కన నెలకొల్పారు. అప్పటి మంత్రి ఎర్రబెల్లి ఆర్థిక సహాయం అందించి ఈ విగ్రహాన్ని ప్రారంభించారు. దీంతో ఎస్సీ కాలనీలో నిర్మించిన గద్దె వృథాగా ఉంటోంది. దీనికి గులాబీ రంగు వేసిన రవి ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహాన్ని దాతల సహాయంతో ఏర్పాటు చేశాడు. అప్పటి నుంచి ఈ వివాదం మొదలైంది. దీంతో గద్దెతో పాటు తెలంగాణ తల్లికి కప్పిన గులాబీ రంగు బట్టను సైతం మార్చాడు. అయినప్పటికీ మళ్లీ కొద్ది రోజుల తర్వాత కాంగ్రెస్ నాయకులు విగ్రహాన్ని కూలగొట్టాలనే పట్టుబట్టారు. కాగా, గ్రామాల్లో నెలకొల్పిన ఏ విగ్రహానికి, ఏ పార్టీ జెండా గద్దెలకు అనుమతి ఉందని, తెలంగాణ తల్లి విగ్రహం కూల్చాలని చూస్తే తాము ఆందోళన చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరిస్తున్నారు.

నిట్‌లో అంతర్జాతీయ సదస్సు

హనుమకొండ చౌరస్తా, జూలై 4 : వరంగల్, గోవా నిట్‌లు సంయుక్త నిర్వహణలో 'ఎమర్జింగ్ మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్'పై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు (ఐఈఎండీఎస్‌టీ-2024) బీఆర్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. ఏఆర్‌సీఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ టాటా నరసింహారావు, న్యూఢిల్లీ జామియామిలియా ఇస్లామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ టోకీర్ అహ్మద్, సదర్న్ డెన్మార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ మిశ్రా, వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి హాజరయ్యారు.

ఇలాంటి అంతర్జాతీయ సమావేశం వరంగల్ నిట్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందని బిద్యాధర్ సుబుధి అన్నారు. నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ థంగరాజు మాట్లాడుతూ.. సమావేశానికి మొత్తం 280 సారాంశాలు అందగా, 245 పత్రాలను ప్రదర్శన కోసం ఎంపిక చేశామని తెలిపారు. రెండురోజుల సమావేశంలో సుమారు 250 మంది పరిశోధకులు పాల్గొంటున్నారని చెప్పారు. ప్రొఫెసర్లు పాల్ జోసెఫ్, జయలక్ష్మి, సైదిరెడ్డి, వెలవాన్ కతిర్వెల్ ఈ సమావేశాన్ని సమన్వయం చేస్తున్నారు.

బల్దియా సొమ్ము హాంఫట్

- తొర్రూరు మున్సిపాలిటీలో రూ. 2.50 కోట్లు జమ
- సీజీజీ తప్పిదంతో డబ్బులు పక్కదారి
- ప్రస్తుతం అవి ఖర్చయ్యాయంటున్న అక్కడి అధికారులు
- పన్నుల వసూళ్ల సొమ్ము ఎప్పుడు తిరిగి వస్తాయోననే అయోమయం

పన్నుల వసూళ్ల సొమ్ము గ్రేటర్ కార్పొరేషన్ ఖాతాలో కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖ పన్నుల వసూళ్ల ప్రోగ్రామింగ్ రూపొందించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) తప్పిదం వల్ల బల్దియా ఖాతాలో జమ కావాల్సిన రూ. 2.50 కోట్లు తొర్రూరు మున్సిపాలిటీ ఖాతాలో జమయ్యాయి. గ్రేటర్ కార్పొరేషన్ ఖాతాలో వైరా, యాదాద్రి మున్సిపాలిటీలకు చెందిన డబ్బులు పడ్డాయి. నెల రోజుల తర్వాత సంస్థ ప్రతినిధులు తప్పును గుర్తించి చెప్పే వరకు బల్దియా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. తొర్రూరు మున్సిపాలిటీ ఖాతాలో జమైన డబ్బులు ఖర్చయ్యాయని, పన్నుల వసూళ్ల సొమ్ము ఎప్పుడు తిరిగి వస్తాయోననే అయోమయం నెలకొంది.

- వరంగల్, జూలై 4

వరంగల్ కార్పొరేషన్‌లో నెల రోజులుగా ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ రూపేణా వసూళ్లయిన సొమ్ము తొర్రూరు మున్సిపాలిటీ ఖాతాలో జమైంది. నెల రోజుల తర్వాత తప్పిదాన్ని గుర్తించిన సీజీజీ సంస్థ విషయాన్ని తెలుపడంతో బల్దియా అధికారులు ఖంగుతిన్నారు. సొమ్మును తిరిగి ఇవ్వాలని గ్రేటర్ అధికారులు లేఖ రాయగా ప్రస్తుతం తొర్రూరు మున్సిపాలిటీలో అన్ని డబ్బులు బిల్లుల చెల్లింపులు, ఇతర అవసరాలకు ఖర్చయ్యాయని చెప్పడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. గ్రేటర్ కార్పొరేషన్ ఖాతాలో వైరా, యాదాద్రి మున్సిపాలిటీలకు చెందిన పన్నుల వసూళ్ల సొమ్ము సుమారు రూ. 50 లక్షలు డబ్బులు జమైనట్లు తెలుస్తోంది. అసలే చిన్న మున్సిపాలిటీలు కావడంలో పన్నుల వసూళ్లు సొమ్ము రాకపోవడంతో జీతాలు, ఇతర అవసరాలకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇప్పటికే రాష్ట్రస్థాయి మున్సిపల్ అధికారులు గ్రేటర్ కార్పొరేషన్‌కు వైరా, యాదాద్రి మున్సిపాలిటీలకు చెందిన డబ్బులను తిరిగి చెల్లించాలని లేఖలు రాశారు. అయితే తొర్రూరు మున్సిపాలిటీలో జమైన గ్రేటర్ కార్పొరేషన్‌కు చెందిన రూ. 2.50 కోట్లు ఎప్పుడు తిరిగి వస్తాయనే దానిపై స్పష్టత లేదు.

సీజీజీ తప్పిదంతో గందరగోళం

సీజీజీ సంస్థ తప్పిదం వల్ల గందరగోళం ఏర్పడింది. దీంతో నెల రోజులుగా గ్రేటర్ కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లు నిలిచిపోయాయి. 9 మీ సేవ సెంటర్లలో పన్నుల వసూళ్లు నిలిపివేశారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పన్నులు స్వీకరించే కౌంటర్‌ను మూసివేశారు. సీజీజీ ప్రోగాంను సరిచేసిన తర్వాత ఆన్‌లైన్‌లో పన్నుల వసూళ్లు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారికంగా దొడ్డి కొమురయ్య జయంతి

- 78వ వర్ధంతి సభలో మంత్రి కోమటిరెడ్డి
- పాల్గొన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే పల్లా

జనగామ, జూలై 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేయించి, ఏప్రిల్ 3న అధికారికంగా ఆయన జయంతి నిర్వహిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని కళ్లెం రోడ్డు జంక్షన్ వద్ద దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, పాశం యాదగిరి, విమలక్కతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో కురుమ సంఘం అధ్యక్షుడు కంచ రాములు అధ్యక్షతన జరిగిన 78వ వర్ధంతి సభలో మంత్రి మాట్లాడారు. రజాకార్ల ఆగడాలను ఎదిరించి 19 ఏండ్లకే ప్రాణాలు బలిపెట్టిన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను ఈ ప్రాంత యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తరతరాలకు కొమురయ్య చరిత్ర తెలిసేలా ముఖ్యమంత్రిని ఒప్పించి ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయించడం సహా జనగామలో స్మారక భవనం కోసం 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తానని చెప్పారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వ